క్లుప్తంగా

బదిలీ ఉద్యోగులకు సన్మానం



ఉద్యోగులను సత్కరిస్తున్న హెచ్‌ఎం రెడ్డన్న

చిన్నమండెం : సాధారణ బదిలీలలో భాగంగా మల్లూరు జెడ్పీ హైస్కూల్ నుంచి జూనియర్ అసిస్టెంట్ మహాలక్ష్మీ రాయచోటి మార్కెట్ ఉర్దూ జెడ్పీ హైస్కూల్‌కు బదిలీ పొందారని ప్రధానోపాధ్యాయులు బి.రెడ్డన్న తెలిపారు. అదే విధంగా మల్లూరు హైస్కూల్‌లో సీఆర్ పీగా పనిచేస్తున్న రమాదేవి రాయచోటికి బదిలీ అయ్యారు. బదిలీ అయిన వారిని బుధవారం మల్లూరు హైస్కూల్‌లో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నజీర్‌బాషా, పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షులు బాబ్జీ, పాఠశాల ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

నివాస స్థలాలు చూపించండి



తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీపీఐ నాయకులు

రామాపురం : మండల పరిధి సుద్దమళ్ల గ్రామ పరిధిలోని ఎగువ హరిజనవాడలోని 50 దళిత కుటుంబాలకు 1994 నాటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఇచ్చిన నివాస స్థలాల పట్టాలకు స్థలాలు చూపించాలని బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అనంతరం తహసీల్దార్ రామాంజనేయులకు వినతి పత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి శ్రీనివాసులు, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సుమిత్ర, మండల నాయకులు ఓబులేసు, గణేష్, మహిళా సంఘం కార్యకర్తలు ప్రమీల, స్వర్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ పాఠశాలలను బుధవారం రైల్వేకోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ పరిశీలించి విద్యార్థులను మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం వడ్డించాలని, విద్యార్థులు కష్టపడి చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లీలా శ్రీహరి, కేజీబీవీ ఎస్‌ఓ రూత్ మేరీ, ముక్కా వరలక్ష్మి, వెంకటసుబ్బయ్య యాదవ్, తాతంశెట్టి నాగేంద్ర, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీధి లైట్లకు మరమ్మతులు

పుల్లంపేట : మండల పరిధిలోని అనంతయ్యగారిపల్లి సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో చెత్తాచెదారం తొలగించి గ్రామమంతా బ్లీచింగ్ చల్లి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచారు. అలాగే వీధి లైట్లకు మరమ్మతులు జరిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ నాయకులు కుమార్ రెడ్డి తెలిపారు.

వెండి ఆభరణాలు వితరణ



వెండి ఆభరణాలు అందజేస్తున్న దాతలు

చిట్వేలి : చిట్వేలి శ్యామలాంబ సమేత శ్రీ సోమేశ్వరస్వామి ఆలయంలో వెలసివున్న శ్రీ శ్యామలాంబ అమ్మవారికి విశ్రాంత ప్రధానోపాధ్యాయులు దోనెల రవీంద్రనాథ్ సతీమణి కళ్యాణి వారి కుటుంబ సభ్యులు రూ.3లక్షలు విలువైన వెండి తొడుగు ఆభరణాలను ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం వితరణ చేశారు. అలాగే మన్నూరు కిషోర్ కుమార్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు అమ్మవారికి పెద్ద హస్తాలు, దోర్నాదుల సంతోష్ కుటుంబ సభ్యులు చిన్న హస్తాలు, కామిశెట్టి సుబ్రమణ్యం కుటుంబ సభ్యులు పాదాలు, సెంకూరు నారాయణ కుటుంబ సభ్యులు కర్ణాభరణాలు వితరణ చేసినట్లు ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు తెలియజేశారు.

దేశభక్తి పెంపొందించడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యం

రామాపురం : విద్యార్థుల్లో దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించడమే ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి చిన్నరెడ్డప్ప అన్నారు. మండలంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో బుధవారం ఉపాధ్యాయురాలు అఫ్రోజ్ బేగం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ విద్యార్థులు పాఠశాల క్రీడా మైదానాన్ని శుభ్రపరిచి, క్రీడలకు సంబంధించిన ఆయా క్రీడా విభాగాలను తయారు చేసుకోవడం అభినందించగల పరిణామన్నారు. పాఠశాల ఆట స్థలం, తమ సొంత గ్రామాలలో పరిసర పరిశుభ్రత చేపట్టాలని వలంటరీ విద్యార్థులకు పిలుపునిచ్చారు.

అంతర పంటలతో ఆదాయం

- తోటల్లో అంతర పంటల సాగుకు ఆసక్తి
- ఆశాజనంగా కూరగాయాల ధరలు
- రోజువారి ఖర్చులకు కలిసొస్తున్నాయంటున్న రైతులు



మామిడిలో అంతర పంటగా అలసంద, పెసర, అనప

రామాపురం : అంతర పంటల సాగు వల్ల రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంది. ప్రధానంగా మామిడి, నిమ్మ, మునగ, కంది తోటలలో అధికంగా రైతులు ఈ పద్ధతి ద్వార పంటల సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మండలంలో 13 గ్రామపంచాయతీలుండగా ఇందులో 180 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఖరీఫ్‌లో ఈ ప్రాంతంలో సాధారణ పంట సాగు విస్తీర్ణం 853 హెక్టార్లుండగా, ఈ ఏడాది కేవలం 29 హెక్టార్లు మాత్రం వేరుశనగ పంటను సాగు చేశారంటే వర్షపాతం ఎంత తక్కువగా నమోదు అయ్యిందో దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ పంట సాగు ప్రతి ఏడాది క్రమేపి తగ్గి పోతుండటం రైతులు ఈ పంట సాగువైపు వెళ్లాలంటే రైతులు జంకుతున్నారు. రబీలో నైనా కొద్దోగొప్పో మోటారు బావుల కింద 100కు పైగా హెక్టార్లలో సాగు వైపు దృష్టి పెడుతున్నారు. దీంతో రైతులలో ఆసక్తి పెరిగి ఉన్న తోటలలో అంతర పంటల సాగువైపు ఆసక్తి చూపుతున్నారు. అందునా కొంత లాభసాటిగా ఉండటంతో వరి సాగుతో పాటు అలసంద, పెసర, అనప, ఇతరత్రా కూరగాయల పంట సాగు చేస్తున్నారు. ముఖ్యంగా గోపగుడిపల్లె, కసిరెడ్డిగారిపల్లె, కల్పనాయినిచెరువు, సుద్దమళ్ల, నల్లగుట్టపల్లె, రాచపల్లె, హసనాపురం, చిట్లూరు, బండపల్లి, సరస్వతిపల్లె గ్రామాలలో అంతర పంటల సాగును రైతులు చేపట్టారు. పంటలు కూడా బాగా ఆశాజనకంగా ఉన్నాయని రైతులు పేర్కొంటున్నారు. ఉలవ పంట సాగు సైతం రైతులు అంతర్ పంటలుగా వేశారు. రబీలో ముఖ్యంగా రైతులు సాగుచేసే కూరగాయ పంటల సాగు రైతులకు లాభసాటిగాను ఉంటున్నాయని పై గ్రామాల రైతులు తెలియజేశారు. ప్రభుత్వం, అధికారులు మరింత ప్రోత్సాహాన్ని అందిస్తే పంటల సాగు విస్తీర్ణం పెరుగుతుందని రైతులు ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రైతులను ప్రోత్సహిస్తున్నాం



మండలంలో ప్రస్తుత సీజన్‌లో అంతర్ పంటల సాగు కింద సుమారు 180 హెక్టార్లలో పలు రకాల పంటలు రైతులు సాగు చేశారు. అంతర్ పంటల సాగు వల్ల రైతులకు పంటల దిగుబడి ఆశాజనకంగా రావడంతో రైతులు వీటిపై మొగ్గు చూపుతున్నారు. అంతర్ పంటల సాగు కింద రైతులు సాగు చేసుకోవడానికి ఉపాధి హామీ పథకం కింద కూరగాయలు పంటల సాగుకు రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రోత్సాహిస్తోంది.

- నాగమణి, మండల వ్యవసాయ అధికారిణి, రామాపురం

రైతులకు చేయూతనిస్తోంది



ఈ ఏడాది వర్షభావ పరిస్థితులు నెలకొన్నాయి. సాగుకు అనుకూలంగా ధరలు కూడా లభించడం లేదు. నాకున్న పొలంలో వాణిజ్య పంటలను సాగు చేస్తున్నాను. అలానే అంతర్ పంటలను సాగు చేస్తుండటంతో కొద్దివరకు ఆదుకుంటున్నాయి.

- రామచంద్ర, రైతు, రామాపురం మండలం

ఆశతో సాగు చేస్తున్నాం



పంటల సాగు కష్ట సాధ్యంగా మారుతున్నా కాలంలో ఏదో చిరు ఆశగా కొద్దోగొప్పో ఈ అంతర్ పంటలైన ఆదుకుంటాయని ఆదుకుంటున్నారు. నాకున్న పొలంలో అంతర్ పంటలుగా ఉలవ, అలసంద, అనుప, ఆముదం, వేరుశనగ వంట పంటలు సాగు చేస్తున్నాం. పెట్టుబడిపోను ఆదాయం చూడచ్చు అని అంతర్ పంటలను సాగు చేస్తున్నా.

- పఠాన్ అయూబ్‌ఖాన్, నీలకంఠ్రావుపేట, రామాపురం మండలం

మధ్యంతర భృతి ప్రకటించాలి

రాయచోటి టౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులకు మధ్యంతర భృతి వెంటనే ప్రకటించాలని ఎన్‌టీపీఏ రాష్ట్ర నాయకులు శ్రీనివాసులురాజు అన్నారు. ఈమేరకు శాసనమండలి సభ్యులు అశోక్ బాబుకు బుధవారం విజయవాడలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఈ ప్రభుత్వంపై మధ్యంతర భృతి ప్రకటనపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారని తెలిపారు. నమ్మకాలను వమ్ము చేయకుండా త్వరగా మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో బకాయిలు చెల్లించేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టీపీఏ నాయకులు ఏబీ కృష్ణమరాజు, వెంకట్రామ రాజు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా మాధవీలత



సిద్దవటం : సిద్దవటం ఇన్‌చార్జి తహసీల్దారుగా డిప్యూటీ తహసీల్దారు మాధవీలత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దారుగా పనిచేసిన మురాషావలి పదవీ విరమణ పొందడంతో మాధవీలత ఇన్‌చార్జి తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. విద్యార్థులకు సంబంధించిన సర్టిఫికెట్లు కుల ధృవీకరణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు నిర్ణీత సమయంలో అందజేస్తామన్నారు. గ్రామ సచివాలయంలో వీఆర్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆమె తెలిపారు.

వరిలో కాండం తొలుచు పురుగు, పాముపొడ తెగుళ్లు



రైతులతో మాట్లాడుతున్న బద్వేల్ ఏడీఏ నాగరాజ

సిద్దవటం : మండలంలోని పొన్నవోలు గ్రామంలో రైతులు సాగు చేసిన వరి(ఎన్‌డీఎల్‌ఆర్ రకం) పూత దశలో ఉందని, కాండం తొలుచు పురుగు, పాముపొడ తెగుళ్లను గమనించామని బద్వేల్ ఏడీఏ నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని జ్యోతి, పొన్నవోలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ వరిలో పాముపొడ తెగులు నివారణకు ఫేమ్ ఎకరాకు 60 మిల్లీ లీటర్లుకు షీత్‌మార్ 2 మిల్లీ లీటర్లును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. వరి నారు పోసే సమయంలో సూడోమొనస్ ఫ్లోరిసెన్స్ బ్యాక్టీరియా జీవ సంబంధ తెగుళ్ల మందుతో విత్తన శుద్ధి తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. కాండం తొలుచు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలు అమర్చాలి. కోరాజన్ అనే పురుగుల మందును ఎకరాకు 50 మిల్లీ లీటర్ల చొప్పున పిచికారీ చేయాలన్నారు. వరి నాటే సమయంలో నారు కొనలు తుంచి నాటాలన్నారు. వరి పంట కోత దశలో ఉందని, కోత అనంతరం తిరిగి రబీ సీజన్‌లో వరి, నువ్వులు, పొద్దు తిరుగుడు పంటలను సాగు చేస్తామని రైతులు తెలిపామన్నారు. అనంతరం పొన్నవోలు రైతు సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, రైతు సేవా కేంద్రం ఉద్యాన సహాయకులు శ్రీనాథ్, రైతులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దాం

- కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటాం
- ఆత్మీయ సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : సమష్టి కృషితో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేద్దామని ఆపార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రామాపురంలోని ఆయన స్వగృహంలో రాయచోటి మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే గడికోట మోహన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషాలతో కలిసి శ్రీకాంత్‌రెడి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికలను తయారు చేద్దామన్నారు. తనకు తోడుగా నిలిచిన కార్యకర్తలు, నాయకుల మేలును మరువలేనన్నారు. సమష్టి కృషితో రానున్న రోజుల్లో పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. కార్యకర్తలు, నాయకులకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా తోడుంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఎన్నికలలో జరిగిన లోపాలను సరి చేసుకుందామని తెలియజేశారు. రాయచోటి పట్టణ అభివృద్ధిపై అనునిత్యం కృషి చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పార్టీ కమిటీలను భర్తీ చేసుకొని పార్టీ బలోపేతం చేస్తామన్నారు. ప్రాణం ఉన్నంతవరకు రాజకీయాలను కొనసాగిస్తామని ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజ్ రెహమాన్, స్టేట్ సివిల్ సప్లయిస్ మాజీ డైరెక్టర్ పోలు సుబ్బారెడ్డి, మదనపల్లి పరిశీలకులు హబీబుల్లా ఖాన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్‌లు వండాడి వెంకటేశ్వర్లు, కొలిమి హరూన్ బాష, మైనార్టీ జిల్లా చైర్మన్ బేపారి మహమ్మద్ ఖాన్, జడ్పీటీసీ మాజీ కో-ఆప్షన్ సభ్యులు అలీ, నవాజ్ ఖాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రియాజ్ రెహమాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఇందాదుల్లా, మండల బిసి నాయకుడు పల్లపు రమేష్, జిల్లా షరీఫ్, కౌన్సిలర్లు, వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మాలధారులకు నిత్య అన్నదానం



లక్కిరెడ్డిపల్లి: అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



రాజంపేట రూరల్: అల్పాహారం అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని నామాల గుట్టపై నూతనంగా ఏర్పాటు చేస్తున్న అయ్యప్పస్వామి దేవాలయంలో ఈనెల 6వ తేది నుంచి జనవరి 10వ తేది వరకు అయ్యప్ప స్వామి భక్తులకు నిత్య అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు చెల్లు గంగరాజు, శివశంకర్ రెడ్డి, గురుస్వామి వెంకటేష్, కదిరి నాగేంద్ర బాబు, యాగంటి సుధీర్ కుమార్, కొండూరు గంగాధర్ రాజులు తెలిపారు. మొదటిరోజు బుధవారం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు ప్రారంభించారు. నామాల గుట్టపై వెలసిన శ్రీశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయ్యప్ప భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గురుస్వాములు గంగయ్య, స్వామి బుజ్జి, శ్రీకాంత్ స్వామి, వేణు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

అల్పాహారం ఏర్పాటు చేసిన ఆకేపాటి

రాజంపేట రూరల్ : అయ్యప్పస్వామి భక్తులకు ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అల్పాహారం అందజేశారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌కు బుధవారం ఉదయం అయ్యప్పస్వామి భక్తులను ఎమ్మెల్యే ఆకేపాటి ఆహ్వానించారు. వారికి నియమ నిబంధనలతో భిక్ష అందజేసి ఆశ్వీరదించారు. అదే విధంగా శివయ్య దీక్ష చేపట్టిన వైఎస్సార్‌సీపీ నాయకులు గంగా కల్యాణ్‌కుమార్‌రెడ్డి మండల పరిధిలోని కొనరాజుపల్లిలో ఉన్న తన ఇంటి వద్ద బుధవారం మధ్యాహ్నం భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. ఆ భిక్షలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆకేపాటి పాల్గొన్నారు.

నవంబర్ 26న దేశవ్యాప్తంగా నిరసనలు

గాలివీడు : దేశంలో ప్రధాని మోడీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతు, కార్మిక, ప్రజా సమస్యల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ నవంబర్ 26వ తేదీన దేశ వ్యాప్తంగా నిరసనలు విజయవంతం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి కోరారు. ఇందుకోసం ఈనెల 8వ తేదీన రాయచోటిలో రైతు, కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమావేశం జరుపనున్నట్లు బుధవారం గాలివీడులో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల కారణంగా వ్యవసాయ, కార్మిక రంగాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న అర్జీలతో కూడిన హెచ్చరికలు జారీ చేయాలని రైతు, కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయన్నారు. మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం తన విధానాలను ఏమాత్రం మార్చుకోలేదన్నారు. రైతులు పండిస్తున్న అన్ని పంటలకూ కనీస మద్దతు ధర చెల్లించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, కౌలు రైతులకు రుణమాఫీ చేయాలని కోరినా పట్టించుకోకుండా, కార్పొరేట్ సంస్థలకు మాత్రం భారీ మొత్తంలో రుణమాఫీ చేసిందన్నారు. కేరళలో అమలవుతున్న వంట రుణ ఉపశమన చట్టాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయండి



టక్కోలు ఎర్రచెరువులో అక్రమ తవ్వకాలు జరుగుతున్న ప్రాంతం

సిద్దవటం : మండలంలోని టక్కోలి గ్రామంలో రైతుల పొలాలను అనుకొని ఉన్న ఎర్ర చెరువులోని అక్రమ మట్టి తవ్వకాలను నిలుపుదల చేయాలని, లేదంటే మా పొలాలు దెబ్బతింటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం రైతు సుబ్బారెడ్డి మాట్లాడుతూ టక్కోలు గ్రామ సచివాలయానికి ఎర్రచెరువు కూతవేటు దూరంలో ఉందన్నారు. అక్రమ మట్టి తవ్వకాలు జరుపుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా కేంద్రంలో ఒక ట్రాక్టర్ మట్టి రూ. 4వేలకు విక్రయిస్తున్నారన్నారు. ఇలానే జరుగుతుంటే మా పొలాలు దెబ్బతింటాయని అధికారుల తక్షణమే కట్టడి చేయాలని ఆయన కోరారు. ఈ విషయమై ఇన్‌చార్జి తహసీల్దారు మాధవీలతను వివరణ కోరగా ఎర్ర చెరువులో అక్రమ మట్టి తవ్వకాలు జరగకుండా కట్టడి చేస్తామని ఆ ప్రాంతంలో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తామని ఆమె తెలిపారు.

కార్మికుల ధర్నాను విజయవంతం చేయండి

రాయచోటి అర్బన్ : సమస్యలు పరిష్కరించాలన్న డిమాండ్‌తో భవన నిర్మాణ కార్మికులు నవంబరు 11న చేస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కోశాధికారి హుస్సేన్ కోరారు. బుధవారం స్థానికంగా ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆయన భవన నిర్మాణ కార్మికులతో కలసి విడుదల చేశారు. మాట్లాడుతూ ప్రభుత్వమే అన్ని ప్రాంతాల్లో ఇసుక పాయింట్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇసుకను అందుబాటులో ఉంచాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డును తీసుకొచ్చి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లకు నిధులు మంజూరు చేయాలంటూ కోరారు. కార్యక్రమంలో సంఘం నేతలు రెడ్డిబాషా, నాగమణి, చోటా, మహబూబ్‌బాషా, వెంకటేష్, ఆదిరెడ్డి, రమణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

పెనగలూరు : మండలంలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ షఫీ తెలిపారు. కొండూరు, పెనగలూరు, బెస్తపల్లి, తిమ్మాయిగారిపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు సహకరించాలని వారు కోరారు.

శిక్షణ పేరుతో శిక్షించొద్దు

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయులను శిక్షణ పేరుతో, రెసిడెన్సియల్ పేరుతో వారంరోజుల పాటు భార్యాపిల్లలకు దూరం చేసి మానసిక ఆందోళనకు గురి చేయరాదని ఆపస్(ఆంధ్ర ప్రదేశ్ ఉపాధ్యాయసంఘం) అన్నమయ్యజిల్లా సంఘం అధ్యక్షులు ఎం.నరసింహులు, ప్రధాన కార్యదర్శి రమణారెడ్డిలు డిమాండ్ చేశారు. ఇప్పటికే వివిధ యాప్‌లు, అనేక రకాల పనులతో మానసిక ఒత్తిడితో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామన్నారు. ఇది చాలదన్నట్లు స్కూల్ లీడర్ షిప్ ట్రెనింగ్, ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ రెసిడెన్సియల్ ట్రెనింగ్‌లను నిర్వహించడం వలన సుదూర ప్రాంతాలలో నిర్వహించడం వలన ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురివుతారని తెలిపారు. అంతేకాకుండా మయస్సు మీద పడటం వలన వారి అనారోగ్యాలకు లోనవతారన్నారు. ఇలాంటి శిక్షణలు మండల కేంద్రాలలో నిర్వహించాలని సూచించారు. ఇప్పటికైనా ఇలాంటి శిక్షణలకు స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు.

కంటి ఆపరేషన్లకు 12 మంది ఎంపిక

సుండుపల్లె : మండల పరిధిలోని రాయవరం ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 12 మంది ఆపరేషన్లకు ఎంపికై నట్లు నిర్వాహకులు తెలిపారు. కడప సాయి నర్సింగ్ హోమ్ ఆధ్వర్యంలో రాయవరం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించి కంటిలో లోపాలు ఉన్న వారిని 12 మందిని గుర్తించి ఆపరేషన్లకు తరలించారు. పలువురికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు.

సిద్దవరంలో పొలం పిలుస్తుంది



రైతులకు జాగ్రత్తలు తెలియజేస్తున్న అధికారులు

పెనగలూరు : మండలంలోని సిద్దవరం, సింగారెడ్డిపల్లి గ్రామాలలో బుధవారం పొలం పిల్తుంది కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యానశాఖ అధికారి సురేష్, వ్యవసాయశాఖ అధికారి పవన్ కుమార్‌లు రైతులకు మామిడి తోటల సాగుపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మామిడి తోటల్లో ఎరువులు ఎప్పుడు వేయాలన్న అంశంపై రైతులకు వివరించారు. మామిడి తోటల్లో తీసుకోవాల్సిన చర్యలు గురించి రైతులకు క్షుణ్ణంగా తెలియజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, హార్టికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి



ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న లిబరేషన్ పార్టీ నేతలు

రాయచోటి అర్బన్ : ఉచిత ఇసుక రవాణాకు ఆటంకాలు సృష్టిస్తూ, విక్రయించి సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లానేత ఎం.విశ్వనాథ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఆయన లిబరేషన్‌పార్టీ కార్యకర్తలతో కలసి రాయచోటి ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. ప్రజలు ఇళ్ల నిర్మాణానికి స్వంత అవసరాలకు ఇసుకను ఉచితంగా తీసుకెళ్లవచ్చునంటూ చెబుతున్నప్పటికీ కొందరు వ్యక్తులు ట్రాక్టర్ ఇసుకలోడుకు ఎలాంటి రశీదులు ఇవ్వకుండానే రూ. 500 నుండి రూ. 1500 వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారంటూ ఆయన ఆరోపించారు. వెంటనే అలాంటి అక్రమార్కులపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలంటూ కోరారు. అనంతరం ఆర్‌డీఓ శ్రీనివాస్‌కు ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో లిబరేషన్‌పార్టీ నేతలు రమణ, శ్రీనుతో పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు లాభదాయకం



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సురేష్‌బాబు

రాజంపేట రూరల్ : వ్యవసాయం చేసే రైతులు యాజమాన్య పద్ధతులతో సాగు చేస్తే వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని వ్యవసాయశాఖ ఏడీఏ జి.సురేష్‌బాబు రైతులకు సూచించారు. మండల పరిధిలోని వరదయ్యగారిపల్లెలో బుధవారం నిర్వహించిన పొలంబడిలో ఆయన పాల్గొన్నారు. రైతులకు పొలంబడి ఆవశ్యకతను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొలంబడి ముఖ్య ఉద్దేశం రైతులకు వ్యవసాయం లాభాసాటిని చేయాలని తెలియజేశారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ప్రకృతి వ్యవసాయంతో సాధించవచ్చని తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయం మానవాళికి ఆరోగ్యకరం అని తెలియజేశారు. కౌలు రైతులకు కౌలు కార్డు ద్వారా బ్యాంక్‌ల నుంచి క్రాప్ లోన్‌లు అందజేస్తున్నట్లు తెలియజేశారు. రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వర్తించి రైతులకు అండగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ఏఓ జి.రాజకుమారి, ఆర్‌ఎస్‌కే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్షలు



అభిప్రాయ సేకరణలో మాట్లాడుతున్న తల్లెం భరత్

ఓబులవారిపల్లె : మంగంపేట కాపుపల్లి హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాల సమస్యలు పరిష్కరించకుంటే నిరాహార దీక్షలు చేపడతామని డీఆర్‌యూసీసీ మాజీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మూడు గ్రామాల తరలింపులో కమ్యూనిటీ హాల్ ఆలయాలు ఏర్పాటుపై సీపీఓ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఓ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్‌ఆర్-5లో ఏర్పాటు చేసే ఆలయాలు కమ్యూనిటీ హాల్ తదితర అంశాలపై గ్రామస్తుల అభిప్రాయం తెలియజేయాలని కోరారు. మార్పులు, చేర్పులపై నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ అర్హులైన కుటుంబాలకు తక్షణమే పరిహారం అందజేయాలని, వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు 227 మందికి పింఛన్లు అందాయని, ప్రస్తుతం 90 మందికి మాత్రమే ఇస్తున్నారన్నారు. మంగంపేట కాపుపల్లి మూడు గ్రామాల పునరావాసంపై అన్యాయం జరిగితే నిరాహార దీక్షలు చేపడతామని భరత్‌కుమార్‌రెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్ రావు, గ్రామస్తులు కొలూరు రమణారెడిడ, పి రామసుబ్బారెడ్డి, దేవకుమార్ రెడ్డి, వేణు పాల్గొన్నారు.

'రైల్వే ఎన్నికల్లో ఎన్‌ఎఫ్‌ఐఆర్‌ను గెలిపించాలి'



ప్రచారంలో నందలూరు ఎంప్లాయిస్ సంఘ్ నేతలు

రాజంపేట : భారతీయ రైల్వేలలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలలో నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వే, జోన్, డివిజన్ స్థాయిలో ఎంప్లాయిస్ సంఘ్‌ను అత్యధిక మెజార్టీ ఓట్లతో గెలిపించాలని ఎంప్లాయిస్ సంఘ్ నేతలు సెక్షన్‌లలో బుధవారం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇండియన్ రైల్వేలో కార్మికుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేసే ఏకైక కార్మిక సంఘం ఎన్‌ఎఫ్‌ఐఆర్ దాని అనుబంధ సంస్థ సంఘ్ అని పేర్కొన్నారు. జాతీయనేత మర్రి రాఘవయ్య నేతృత్వంలో ఎన్‌ఎఫ్‌ఐఆర్, ఎంప్లాయిస్ సంఘ్‌లు కార్మికుల పక్షాన నిలబడి వారికి అండగా నిలుస్తోందన్నారు. ఈ ప్రచారంలో నందలూరు బ్రాంచి తరపున సెక్రటరీ వై.రవిప్రకాశ్, చైర్మన్ పెంచలయ్య, కార్యవర్గ సభ్యులు, బీఈసీ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు. రాజంపేట, పుల్లంపేట, హస్తవరంలోని ఎల్‌సీగేట్స్‌తోపాటు భాకారపేట నుంచి ఓబులవారిపల్లె వరకు ఉన్న అన్ని ఎల్‌సీగేట్స్‌లో కార్మికులను కలుసుకొని ఓట్లను అభ్యర్థించారు. అలాగే వివిధ విభాగాల ఉద్యోగులను, కార్మికులను కలుసుకొని ఓట్లు వేయాలని కోరారు.